# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట






కోనేరు పునర్నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి

### వైభవంగా పడమటి అంజన్న

## జాతరకు ఏర్పాట్లు

**అంత్యదశలో కోనేరు పునర్నిర్మాణం పనులు**

**మినీ ట్యాంక్ బండ్ పనులను వేగవంతం చేయాలి**

**ఆదేశించిన మంత్రి వాకిటి శ్రీహరి**

**మక్తల్ టౌన్, నవంబరు 12 ప్రభాతవార్త :** జాతర సమయానికి అందుబాటులోకి కోనేరు పనులు వేగవంతం చేయాలని డిసెంబర్ 4 నుండి జాతర ప్రారంభం కానున్న సందర్భంలో కోనేరు పనులను అత్యంత వేగంగా పునర్నిర్మాణం పనులు చేపట్టి నాటికి అంతదశలోకి చేరాయి. దాదాపు పనులన్నీ పూర్తి కాగా కోనేరులోకి జలాన్ని నింపి జాతర సమయాని కల్లా కోనేరు నీటితో ఆంజనేయస్వామి పాదాలు కడిగేందుకు భక్తులందరూ ఆ నీటిని తలపై వేసుకొని దర్శనం చేసుకునే విధంగా తుది దశకు పనులు వేగవంతంగా జరిగాయి. సంబంధిత అధికారులకు మిగతా పనులు చేయాలని ఆదేశించారు. అలాగే అక్కడినుండి పట్టణంలోని మినీ ట్యాంక్ వద్ద రూ.75 లక్షలతో సుందరీకరణ పనులను మంత్రి వాకిటి శ్రీహరి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇక్కడ నిర్మించబోయే భవనాలు,వ్యాపార సముదాయాలు, టాయిలెట్లు ,కాంప్లెక్స్ దుకాణాలు, యాత్రికులకు విశ్రాంతి భవనాలు నిర్మించాల్సి ఉందని అందుకు అనుగుణంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు.




ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

### దరఖాస్తులను వెంటనే

## పరిష్కరించాలి

**- దివ్యాంగులు, వృద్ధుల సమస్యలపై**

**దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ విజయేందిర బోయి**

**మహబూబ్‌నగర్‌బ్యూరో,నవంబర్ 12,ప్రభాతవార్త:** వృద్ధులు,దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో గతంలో వచ్చిన పెండింగ్ దరఖాస్తుల వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం అర్బన్ తహిసిల్దార్ కార్యాలయంలో ప్రతినెలా మొదటి బుధవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వలన రెండవ బుధ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి ఆమె వృద్ధులు,దివ్యాంగుల సమస్యలను శ్రద్ధగా విని, ఫిర్యాదులను స్వీకరించి, మొదటి ప్రాధాన్యతగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు.ఈ సందర్భంగా 20 మంది దివ్యాంగులు,ఏడుగురు వృద్ధులు తమ సమస్యల వినతీ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని వారం రోజులు నిర్వహించే కార్యక్రమాల పోస్టర్ ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, నాగభూషణం, రాజసింహుడు, శివ్వన్న పంతులు, అంజయ్యాచారి,పాండురంగం, నాగేంద్రస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## పీఎం కేర్ పిల్లలతో కలెక్టర్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

**నారాయణ పేట, నవంబరు 12 ప్రభాతవార్త :** కోవిడ్19 కారణంగా తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లల కోసం పీఎం కేర్స్ పథకం కింద నిర్వహించే త్రైమాసిక సమీక్షలో భాగంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్‌తో కలిసి కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పీఎం కేర్ కింద ఉన్న ఇద్దరు పిల్లలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి ఆరోగ్యం విద్య భద్రతపై వివరాలు తెలుసుకున్నారు. పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, చదువుపై వారి ఆసక్తిని ప్రశంసించారు. పీఎం కేర్స్ కింద వస్తున్న ప్రయోజనాల కోసం ఉన్న ఉమ్మడి ఖాతాలను చెక్ చేయాలని పిల్లల తండ్రి పేరున్న భూమిని పిల్లల పేర్లకు మార్చే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా స్పాన్సర్‌షిప్ మార్గదర్శకాలను అనుసరించి అవసరమైన సాయం అందించాలని పిల్లల రక్షణకు సంబంధించి తరచుగా ఫాలోఅప్ చేయాలని డీసీపీఓ కరిష్మాను ఆదేశించారు.

### పాలమూరు

# @14 డిగ్రీలు



- ఉమ్మడి జిల్లాలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రత
- నాలుగు రోజుల్లోనే మారిన వాతావరణం
- పది డిగ్రీలు పడిపోయిన టెంపరేచర్

**మహబూబ్‌గర్ బ్యూరో, నవంబర్ 12 ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరును చలి కొరికేస్తుంది. నాలుగు రోజుల నుంచి చలి తీవ్రత బాగా పెరిగింది. సాయంత్రం అయిందంటే చల్ల గాలులకు జనం అల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు ఒకటి రెండు రోజుల్లోనే 10 డిగ్రీల వరకు పడిపోవడంతో వాతావరణం లో పెద్ద ఎత్తున మార్పులు చోటు చేసుకున్నాయి. మహబూబ్నగర్, నారాయణపేట జిల్లాలో 14 డిగ్రీలకు టెంపరేచర్ పడిపోయింది. పాలమూరులో కనిష్ఠ ఉష్ణోగ్రతలు వారం క్రితం 23 ఉండగా, మంగళవారం 14 డిగ్రీలకు పడిపోయింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా చలి తీవ్రత పెరగడంతో రాత్రి అయ్యిందంటే బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. తెల్లవారుజామున చలికితోడు మంచు కురుస్తుండటంతో ఆ సమయంలో పనులు చేసుకునే వారికి తిప్పలు తప్పడం లేదు. పాల వ్యాపారులు, కూరగాయల రైతులు, మునిసిపల్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మార్నింగ్ వాకర్స్, అయ్యప్ప భక్తులు, కార్తీక పౌర్ణమి వేళ తెల్లవారుజామునే పూజలు చేసుకునే మహిళలు, బడికి పిల్లలను పంపించే తల్లులు, పేపర్‌బాయ్స్, ప్రయాణం చేసేవారు, డ్రైవర్‌లు చలికి తట్టుకోలేకపోతున్నారు. రానున్న వారం రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో జనాలు ఆందోళన చెందుతున్నారు. చలికి ప్రజలు స్వెటర్లు, మంకీ క్యాపలు ధరిస్తున్నా రు. నగరంలో ఫుట్‌పాత్‌లపై స్వెటర్ల విక్రయాలు జోరందుకున్నారు. దుకాణాలలో స్వెటర్లకు ఆర్డర్లు పెడుతున్నారు. చలికి చేతులు, కాళ్లు పొడిబారడం, పెదాలు పగులుతుండటంతో కోల్డ్ క్రీ మ్‌లు వినియోగిస్తున్నారు. కప్పుకునేందుకు ఉలన్ రగ్గులు వాడుతున్నారు. బుధవారం మహబూబ్ నగర్ జిల్లాలోని గండీడ్, సల్కర్‌పేట వద్ద అత్యల్పంగా 14డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతవాతరణ శాఖ లెక్కల ద్వారా తెలుస్తున్నది. గత ఏడాది నవంబర్‌లో నెలలో ఇదే రోజు 16డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ ఏడాది సుమారు రెండు డిగ్రీలు తక్కువ నమోదైంది.ఈ నేపథ్యంలో ఈ ఏడాది టంపరేచర్ మరింత పడిపోయే అవకా శం ఉందని, చిన్నపిల్లలు, వృద్ధుల విషయం లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణలు సూచిస్తున్నారు.



## ఇకపై వైఎస్ఆర్ కిట్

- ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయ్యే మహిళలకు అందజేత
- ఆరోగ్య తెలంగాణలో ఆశా కార్యకర్తలది కీలక పాత్ర
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



ఆశ కార్యకర్తలకు చీరలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 12,ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేసే మహిళలకు వైఎస్సార్ కిట్‌ను అందజేస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆశా కార్యకర్తలకు యూనిఫాం (చీరలు)ల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆశా కార్యకర్తలు ప్రజా ఆరోగ్య రంగంలో పోరాట సైనికులుగా సేవలందిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గర్భిణులకు సూచనలు ఇవ్వడం, వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడం, సురక్షిత ప్రసవాలు కోసం అవగాహన కల్పించడం వంటి పనుల్లో ఆశా కార్యకర్తల సేవలు అమూల్యమని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రసవాలను ప్రభుత్వ దవాఖానల వైపు మళ్లించేందుకు సర్కార్ కట్టుబడి ఉందన్నారు. నవంబర్ 14వ తేదీ నుండి ప్రభుత్వ దవాఖానలో ప్రసవం అయ్యే తల్లులకు వైఎస్సార్ కిట్ అందజేస్తామని స్పష్టం చేశారు.ఆకిట్‌లో శిశువుకు అవసరమైన పౌడర్ , దుస్తులు, నూనె, దుప్పటి, దోమ తెర , సుబ్బులు , ఆయిల్స్, బాడీ లోషన్ ఉంటాయని ఆయన వివరించారు. పోషకాహార లోపంతో పుట్టే శిశువులకు ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణుల హెచ్చరికలను పేర్కొంటూ, ప్రతి గర్భిణి సమయానికి వైద్యం రీక్షలు చేయించుకోనేవిధంగా ఆశా కార్యకర్తలు శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. ఆరోగ్య తెలంగాణ సాధనలో ఆశా కార్యకర్తల పాత్ర చాలా ముఖ్యమని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ గోనెల శ్రీనివాసులు, ఐఎన్టీయుసి రాములు యాదవ్, అంజద్ , అశ్వాక్ , చర్ల శ్రీనివాసులు, మోయిజ్, వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



శ్రీ కురుమూర్తి స్వామి దర్శించుకుంటున్న స్పీకర్, మంత్రి, ఎమ్మెల్యేలు

### ప్రజా ప్రభుత్వాన్ని

## ఆశీర్వదించాలి

**శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్న**

**రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ,**

**మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు**

**మహబూబ్‌నగర్, నవంబరు 12 ప్రభాతవార్త :** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ కురుమూర్తి స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కురుమూర్తి స్వామి దేవాలయం వద్దకు చేరుకోగానే రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య డైరీ అబివృద్ధి, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి, మహబూబ్‌నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి, ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డిలు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. కురుమూర్తి ఆలయం కొండ దిగువన ఆలయ ప్రధాన రాజగోపురం వద్ద పోలీస్ గౌరవ వందనం -మిగతా4లో..



లాంచ్‌లో ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకుంటున్న మంత్రి జూపల్లి

### సోమశిల శ్రీశైలం లాంచీలో

## సౌకర్యాలు కల్పించాలి

**పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**కొల్లాపూర్,నవంబరు 12 ప్రభాతవార్త :** పర్యాటక రంగంలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరిచి సందర్శకులకు అన్ని సౌకర్యాలతో కూడిన వసతులను కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అందులో భాగంగా సోమశిల నుండి శ్రీశైలం వెళ్ళే పర్యాటకులకు అన్ని సదుపాయాలు కల్పించడానికి పర్యాటకశాఖ అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి నరసింహకు మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. బుధవారం కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామానికి విచ్చేసి శ్రీశైలం వెళ్లే క్రూయిజ్ లాంచ్ లో ప్రయాణించే పర్యాటకుల సౌకర్యార్థం వసతుల ఏర్పాట్ల గురించి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహని అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని రెగ్యులర్‌గా శ్రీశైలంకు లాంచీ నీ నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, పర్యాటకులు, లాంచి మెయింటెనెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రైతుల ఆదాయ వృద్ధి లక్ష్యంగా

## పీఎం ధన్ ధాన్య కృషి యోజన



చేప పిల్లలను వదులుతున్న జిల్లా నోడల్ అధికారి నీతు కుమారి ప్రసాద్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**దేశంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలిచేలా అధికారులు కృషి చేయాలి**

**జిల్లాను వ్యవసాయ రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దే లక్ష్యంతో అధికారులు కృషి చేయాలి**

**నాగర్ కర్నూల్ జిల్లా నోడల్ అధికారి నీతు కుమారి ప్రసాద్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్, నవంబరు 12 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన (పిఎం డిడికెవై) అమలుకు సంబంధించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ పీఎం డీడీకేవై జిల్లా నోడల్ అధికారి నీతూ కుమారి ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవరం నాగర్ కర్నూల్ జిల్లాలోని వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ, ఉద్యాన, సాగునీటి,బ్యాంకింగ్,మార్కెటింగ్ తదితర శాఖల అధికారులతో శాఖ వారిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నీతూ కుమారి ప్రసాద్ మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న పీఎం ధన్ ధాన్య కృషి యోజనను సమర్థవంతంగా అమలు చేయాలని ఆమె అధికారులను కోరారు. ప్రతి శాఖాధికారితో ప్రత్యేకంగా చర్చిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు స్థితిని సమీక్షించారు. జిల్లాలో పీఎం ధన్ ధాన్య కృషి యోజనను సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు, అడ్డంకులు, పరిష్కార మార్గాలను విపులంగా తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా రైతులు లాభదాయకమైన పంటలను సాగు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. తక్కువ వ్యవసాయ ఉత్పాదకత కలిగిన జిల్లాలను గుర్తించి, ఉత్పత్తి పెంచడం, నీటి వినియోగాన్ని సమర్థవంతం చేయడం, మార్కెట్‌కు అనుగుణమైన పంటలపై దృష్టి పెట్టడం లక్ష్యంగా ఈ పథకం రూపొందించబడిందని వివరించారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా 100 జిల్లాలను ఎంపిక చేసి, ప్రతి ఏడాదీ రూ. 24 వేల కోట్ల నిధులను ఆరు సంవత్సరాల పాటు కేటాయిస్తామని తెలిపారు. పీఎం ధన్ ధాన్య కృషి యోజన కింద 11 మంత్రిత్వ శాఖల పరిధిలోని 36 పథకాలను సమ్మిళితం చేసి అమలు చేయనున్నట్లు చెప్పారు. ఈ పథకం వ్యవసాయ రంగ అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తుందని, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం ముఖ్యమని తెలిపారు.రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయ ఉత్పత్తిని మెరుగుపరచడం, మరియు వ్యవసాయాన్ని లాభదాయక వృత్తిగా మార్చడం పీఎం ధన్ ధాన్య కృషి యోజన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు ఒకే రకమైన పంటలపై ఆధారపడకుండా, వైవిధ్యమైన పంటలను సాగు చేయడం ద్వారా మార్కెట్‌లో మంచి ధరలు పొందవచ్చని తెలిపారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులు అవలంబించడం ద్వారా నీటి వనరుల వినియోగం సమర్థవంతంగా జరుగుతుందని, నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఈ పథకం ద్వారా రైతులు మాత్రమే కాకుండా, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, - మిగతా4లో..



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

### నకిలీ బంగారంతో

## ఘరానా మోసం..

- గోల్డ్ కోటెడ్ బంగారం చూపించి రూ.7.50లక్షలు టోకరా.. - ఇద్దరు మహిళలు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన నాగర్‌కర్నూల్ పోలీసులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 12,ప్రభాతవార్త :** బంగారం ఇన్వెస్ట్మెంట్ పేరుతో మోసం చేసిన ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి వారి నుంచి నగదు బంగారం స్వాధీనం చేసుకున్నట్లు నాగర్‌కర్నూల్ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలం అంతారం గ్రామానికి చెందిన అలివేల, వికారాబాద్‌కు చెందిన అనిత నాగర్‌కర్నూల్ పట్టణంలో నివాసం ఉంటున్నారు. బంగారం గోల్డ్ కోటెడ్ ఆభరణాలు చూపించి ప్రజల నుంచి డబ్బులు కొంత మేర సేకరించారు. అధిక లాభాలు వస్తాయని అమాయక ప్రజలను నమ్మించి దాదాపు రూ.7.5 లక్షల వరకు మోసం చేశారు. మోసపోయిన బాధితులు 1160 గ్రాముల బంగారం నకిలీ ఆభరణాలు కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. పోలీసులకు ఫిర్యాదు అందిన వెంటనే ఎస్ఐ మారుతీ నాయక్ బృందం ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల వద్ద నుంచి నకిలీ బంగారం,రెండుస్వాక్స్ బాక్స్‌లు,నగదు రూ.7,50,000 -మిగతా4లో..



పత్తిని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

### నిబంధనల ప్రకారం

## పత్తి కొనుగోలు చేయాలి

**గద్వాల టౌన్ నవంబర్ 12, ప్రభాతవార్త:** సీసీఐ నిబంధనల ప్రకారం రైతులు పత్తి ఆరబెట్టుకుని వచ్చేలా సంబంధిత ఏఈఓ లు అవగాహన కల్పిస్తే, రైతులు నష్టపోకుండా పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. బుధవారం అలంపూర్ చౌరస్తా సమీపంలో ఉన్న వరసిద్ధి వినాయక జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. సీసీఐ నిబంధనల ప్రకారం 8నుంచి 12లోపు తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేస్తున్నందున రైతులు దాని ప్రకారం ఆరబెట్టుకుని తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం స్లాట్ బుకింగ్ విధానంలో ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తుండగా, 12 క్వింటాళ్ల కొనుగోలు చేయాలని, అకాల వర్షాలతో పత్తి దెబ్బతినడంతో తేమ ఎక్కువగా ఉన్న కొనాలని పలువురు రైతులు కలెక్టర్‌ను కోరారు. ఇటీవలే ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ -మిగతా4లో..

## డిజిటల్ పద్ధతిలో వివరాల స్వీకరణ

**నారాయణ పేట, నవంబరు 12 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్న తరహా నీటి వనరుల గణన 2023,24 రెండవ జలాశయముల గణనపై జిల్లా స్థాయి సమన్వయ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విద్యుత్ నీటిపారుదల భూగర్భ జలవనరులు పంచాయత్ రాజ్, ప్రణాళిక శాఖల అధికారులు పాల్గొన్నారు. ముఖ్య ప్రణాళిక అధికారి యస్.యోగానంద్ గణన ఉద్దేశ్యం, డిజిటల్ పద్ధతి వివరాలను తెలిపారు. ఈ ఏడాది 7వ చిన్న తరహా నీటి వనరుల గణన 2వ జలాశయముల గణన పూర్తిగా మొబైల్ యాప్ ద్వారా జరగనుంది. మండల స్థాయిలో జిపిఓలు పంచాయతి కార్యదర్శులు ఏఈఓలు, ఎనిమినేటర్ లుగా పనిచేస్తారు. కలెక్టర్ శిక్షణ తరగతులు నిర్వహించాలని ప్రతి శాఖ మూడు రోజుల్లో తమ వివరాలు సమర్పించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ, వ్యవసాయ కనెక్షన్ వివరాలు నీటిపారుదల శాఖ చెరువులు, చెక్‌డ్యాంల వివరాలు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## త్వరలో పేట పట్టణంలో ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోకి

**నారాయణ పేట, నవంబరు 12 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చే దిశగా ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి చొరవతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ చర్యలు ప్రారంభించాయి. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో త్వరలో వైద్య సేవలు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి.సలీం, మార్కెట్ డైరెక్టర్ బోయ శరణప్ప, సీనియర్ నాయకులు గందే చంద్రకాంత్, చిట్టెం మాధవ్ రెడ్డి తదితరులు హాస్పిటల్ భవనాన్ని పరిశీలించారు.రాబోయేపక్షంలో హాస్పిటల్ ప్రారంభమవుతుందని రోజువారీగా ముగ్గురు ఎంబీబీఎస్ వైద్యులతో ఓపీసేవలు మందుల పంపిణీ రక్తపరీక్షలు అత్యవసర సేవలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పట్టణ కాంగ్రెస్అధ్యక్షుడు ఎండి.సలీం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సుమారు 9కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించగా పాతఏరియా హాస్పిటల్ స్థలంలో 30పడకలతో కొత్త ఆసుపత్రి భవనం నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు.



ఆసుపత్రి భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ విజయవంతం

### ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్, నవంబరు 12 ప్రభాతవార్త:** బికేఆర్ ఫౌండేషన్ వారి హెల్త్ క్యాంపు ఫ్రీ చెకప్ ఉచితంగా మందుల పంపిణీని ఫౌండేషన్ అధినేత గవినోళ్ళ బాలకిష్ట రెడ్డి సంఘం బండ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించి బికేఆర్ ఫౌండేషన్ నేత బాల కృష్ణారెడ్డిని అభినందించారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి శ్రీ పంచమసిద్ద లింగ స్వామి బాలకృష్ణారెడ్డిని అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మన ప్రాంతంలో జరగడం అభినందనీయమని కొనియాడారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ క్యాంప్‌లో 7 రకాల ఉచిత వైద్య సేవలు పేదలకు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయడం తో పాటు మానవ సేవే మాధవ సేవ అని బిఆర్‌కే ఫౌండేషన్ నిరూపితం అవుతుందని ఇలాంటి క్యాంపులు ఈ ప్రాంతంలో మరిన్ని ఏర్పాటు చేసి ప్రజలకు మరింత సేవ చేయాలని నిర్ణయించుకున్నామని బికేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పంచమసిద్ధ లింగస్వామి, మక్తల్ మార్కెట్ చైర్మన్ రాధా లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ కేశవరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభం

**మద్దూరు, నవంబరు 12 ప్రభాతవార్త :** ఉమ్మడి మద్దూరు కొత్తపల్లి మండలంలోని నిర్జింత, గోకుల్‌నగర్, మన్నాపూర్ గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాడ అధికారి వెంకట్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ఐకెపి కేంద్రాల ద్వారా విక్రయించి ప్రభుత్వ నిర్ణయించిన కనీస మద్దతు ధర ఏ గ్రేడ్‌కు రూ.2,389, సాధారణ రకం ధాన్యానికి రూ.2,369 పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ విజయకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది బీములు, పీఎసీసీఎస్ చైర్మన్ గూళ్ల నర్సింహులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నిర్జింత తిరుపతిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, నాగేష్ గౌడ్, బాలు, శ్రీనివాస్ రెడ్డి, ఏవో రమేష్ నాయక్, ఏపిఎం కృష్ణవేణి, మహిళా సమైక్య అధ్యక్షురాలు సవిత తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న అధికారులు

## మాజీ కౌన్సిలర్ అగుస్తా రమేష్‌కు పరామర్శ

**నారాయణ పేట, నవంబరు 12 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ 6వ వార్డు మాజీ కౌన్సిలర్ అగుస్తా రమేష్ అనారోగ్య కారణంగా ఇటీవల చిన్నపాటి శస్త్ర చికిత్స చేయించుకుని ప్రస్తుతం ఆరోగ్యంగా కోలుకుంటున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి సీనియర్ నాయకులు నాగురావు నామాజీ, బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, మాజీ కౌన్సిలర్ రాఘవేంద్ర, మాజీ పట్టణ కోశాధికారి హన్మంత్‌రావు, చామకుర దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణ, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు మనీశంకర్, సీనియర్ నాయకుడు కుమారన్న తదితరులు ఆయనను పరామర్శించారు.



మాజీ కౌన్సిలర్‌ను పరామర్శిస్తున్న నాగూరావు నామాజీ

## రాష్ట్ర స్థాయి అండర్ 17 పోటీలకు శిరీష ఎంపిక

**బిజినేపల్లి, నవంబరు 12 ప్రభాతవార్త:** నంది వడ్డేమాన్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని పి.శిరీష ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన 8 వందల మీటర్ల అథ్లెటిక్స్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి అండర్ 17 పరుగు పందెం పోటీలకు ఎంపికయిందని ప్రధానోపాధ్యాయుడు మురళిమోహన చార్యులు బుధవారం తెలిపారు. ఉమ్మడి జిల్లా స్త్రాం అథ్లెటిక్స్ 800 మీటర్ల పరుగు పందెం పోటీని కేవలం 2 నిమిషాల 52 సెకన్లలో పూర్తి చేసి మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శిరీషను హెచ్ఎంతో పాటు పీఈటీ లక్ష్మీ మపతి, ఉపాధ్యాయులు హనుమంత్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, నాగిరెడ్డి తదితరులు అభినందించారు.




రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికైన విద్యార్థిని పి.శిరీషను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

# తాగునీరు రాక మూడు నెలలైంది...

- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- మిషన్ భగీరథ పైప్లైన్ ఉన్న నీళ్లురావు
- అధికారులకు చెప్పిన ఫలితం శూన్యం
- ఏమి చేయలేమని చేతులెత్తేసిన ఆఫీసర్లు



వృధాగా మిషన్ భగీరథ పైపులు



మిషన్ భగీరథ నీళ్లు ప్రెషర్ లేకపోవడం వల్ల డ్రైనేజీలో నీళ్లను పట్టుకుంటున్న దృశ్యం

**మాగనూర్, నవంబరు 12 ప్రభాతవార్త :** ఇంట్లో నీళ్ల లేకపోతే ఇంట్లో పనులు సాగవని అందరికీ తెలిసిన విషయమే. కానీ ఏకంగా మూడు నెలల నుండి మండల కేంద్రం 3,4 వ వార్డులలో త్రాగునీరు సరఫరా ఆగిపోయింది. ఉదయం లేచారంటే చాలు నీళ్ల కోసం బిందెలు పట్టుకొని పరుగులు తీస్తున్న ప్రజల బాధలు వర్ణాతీతం.ఆగస్టునెలలో భారీవర్షాలకు వాగులో ఉన్న పైపులు కొట్టుకుపోవడమే దీనికి కారణమని ఆఫీసర్లు చెబుతున్నారు. ప్రకృతి వైపరిత్యం వల్ల ఏర్పడ్డ సమస్యకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసి త్రాగునీరు అందించాల్సిన ఆఫీసర్లు మేమేమి చేయలేమని చేతులెత్తేశారు. మిషన్ భగీరథ పైప్ లైన్లు ఉన్న నీళ్ల రావట్లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్ల కలెక్షన్ అధికారుల రికార్డుల్లో మాత్రమే నమోదు అయిందని, నీరు అందించడంలో మిషన్ భగీరథ ఖాళీ పైపులకే పరిమితం అయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ సరఫరా చేసే నీటి ట్యాంకు ఈ వార్డులకు పైప్‌లైన్ డిస్టెన్స్ ఎక్కువగా ఉండడంతో నీరు అందడం లేదని అధికారులు చెబుతున్నారు. ఏదేమైనా ఈ వార్డులలో ప్రజలకు నీటి తంటాలు తప్పడం లేదు. శాశ్వత పరిష్కారంగా అందుబాటులో నీటి ట్యాంకులు నిర్మించి, నీటి కష్టాల నుంచి తప్పించాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

**ప్రజల కష్టాలు పట్టవా...**

మూడు నెలల నుంచి త్రాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల కష్టాలు అధికారులకు పట్టవా అని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరద వల్ల పైప్‌లౌన్‌లు కొట్టుకుపోతే, ప్రత్యమ్నయంగా ఆయా ఏరియాలకు నీరు సరఫరా చేయాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు అంటున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడ్డ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలకు గుర్తు చేస్తున్నారు. ఏది ఏమైనా పునరుద్ధరణ పనులు త్వరగా చేపట్టి, తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**మిషన్ భగీరథ పైపులకే పరిమితం....**

ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీళ్ల అందించామని అధికారుల రికార్డుల్లో ఉంటుంది.గానీ పూర్తిస్థాయిలో నీరు అందడం లేదని ప్రజలు అంటున్నారు. నీటిని సప్లై చేస్తే ట్యాంక్ పైప్లైన్ దూరం ఎక్కువగా ఉండడంతో నీరు అందడం లేదని అధికారుల దృష్టిలో కూడా ఉంది. కానీ నీటి ఇబ్బందులు నెలలు గడుస్తున్న ప్రత్యామ్నయ పనులు చేపడుతున్న దాఖలాలు లేవు. అందుబాటులో ట్యాంకులు నిర్మించి మిషన్ భగీరథ నీరు అందించాలన్న డిమాండ్ ప్రజల నుండి ఉన్న అధికారులు నిర్లక్ష్యంగా పిడచెవిన పెడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ ఆఫీసర్లు స్పందించి శాశ్వత పరిష్కారంగా అందుబాటులో నీటి ట్యాంక్ నిర్మించి,నీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వాగులో వరద ఉధృతికి పాడైన పైప్ లైన్

### తాగునీరు అందించండి..



మా ఏరియాకు తాగునీరు సరఫరా లేక మూడు నెలలు అవుతుంది. మిషన్ భగీరథ పైప్ లైన్ ఉన్న అందులో నీళ్ల వస్తలేవు. ప్రతిరోజు నీళ్ల కోసం బిందెలు పట్టుకుని పరుగులు తీయాల్సిన పరిస్థితి. అత్యవసరాలలో భాగంగా మాకు త్రాగునీరు అందించాలని అధికారులను కోరుతున్నా.

**కొనింటి హన్మంతు, మాగనూర్**

### త్వరలోనే తాగునీరు అందిస్తాం..



వాగులో తాత్కాలిక పైపులను వేసి త్వరలోనే 3,4 వార్డులకు తాగునీరు అందిస్తాం. మిషన్ భగీరథ ట్యాంక్ అందుబాటులో నిర్మించేందుకు గతంలోనే ప్రతిపాదనలు పంపించాం. సాంక్షన్ వస్తే నిర్మించి, చివరి పైప్లైన్ వరకు నీటి సరఫరా చేస్తాం.

**తిమ్మప్ప పంచాయతీ కార్యదర్శి మాగనూర్**

# మృత్యుకుహరాలుగా మూలమలుపులు

### కనిపించని ప్రమాద సూచిక బోర్డులు

**నవాబుపేట, నవంబరు 12 ప్రభాతవార్త :** మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్డు మూల మలుపులు మృత్యువుకు పిలుపుగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణం అంటేనే వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు. మూల మలుపులు గమనించక ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కొందరు క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. ప్రమాదకర మలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని పత్రికల్లో వార్తలు వచ్చిన అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని చాలా గ్రామాలకు వెళ్లే రోడ్డులో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. రుద్రారం నుండి కొండాపూర్ వెళ్లే మార్గాలు అయితే దాదాపు 4 నుండి 5 మూలమలుపులు ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. కొండాపూర్‌కి చేరువలో మూలమలుపు అయితే సరాసరి యమలోకానికి దారి అన్నట్టుగానే మూలమలుపులో భారీ పెద్దబావి, మలుపులో పెరిగిన చెట్లతో అటువైపు ఏ వాహనం వస్తుందో కూడా తెలియనంత ప్రమాదకరంగా సూచిక బోర్డులు లేక మలుపులు వాహనదారులకు యమలోకానికి స్వాగతం పలుకుతున్నట్టుగా అనిపిస్తుంది ఆ రోడ్డు. మూడుచోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఇలా అనేక చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి.వీటి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల పరిధిలోని అనేక గ్రామాల్లో ప్రమాదకరమైన మూలమలుపుల తో పాటు ఇరువైపులా చెట్లు అల్లుకు పోవడంతో మలుపులు గమనించక వాహనచోదకులు ప్రమాదాలకు గురై పలువురు మృత్యువాత పడ్డ ఘటనలు కూడా ఉన్నాయి. అనేక వాహనాలు నిత్యం ప్రమాదాలు జరిగి క్షతగాత్రులవుతున్నారు.మూల మలుపులో ఉన్న బావులకు కంచె ఏర్పాటు చేయకపోవడం కనీసం జెసిబిలతో అయిన చెట్లను తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్యమే. ఈ ప్రమాదాలు అకస్మాత్తుగా ఎదురైన వాహనాలను తప్పించే క్రమంలో కొన్నిసార్లు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మూల మలుపుల వద్ద చోదకులు నిర్లక్ష్యంగా ఉంటే తీవ్రత మరింత పెరుగుతుంది సూచికలు లేకపోవడంతో ఈ దారి వెంబడి కొత్తగా ప్రయాణించే వ్యక్తులు రోడ్డు ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేక అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ప్రమాద మూల మలుపులు ఉన్న రహదారులకు ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని పలు గ్రామాల వాహనదారులు ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా రోడ్డు మలుపులు



ప్రమాదకరంగా రోడ్డు మలుపులు

# మాలల రణభేరి మహాసభను జయప్రదం చేయండి

### మాల మహానాడు జిల్లా అధ్యక్షులు నారాయణ

**మాగనూర్, నవంబరు 12 ప్రభాతవార్త:** ఈనెల 23న హైదరాబాదులోని సరూర్‌నగర్ స్టేడియం గ్రౌండ్ లో తలపెట్టిన మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయాలని మాల మహానాడు నారాయణపేట జిల్లా అధ్యక్షులు నారాయణ కోరారు. బుధవారం మాగనూర్ మండల కేంద్రంలో సంఘం సభ్యులతో కలిసి సభ కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత జనాభా లెక్కలు లేకుండా, ఎలాంటి ఎంపరికల్ డేటా తీసుకోకుండా సుప్రీం కోర్టు సూచనలను పాటించకుండా 2011 జనాభా లెక్కలతో వర్గీకరణ జరిగిందన్నారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపులోను మాలలకు తీవ్ర నష్టం జరిగేలా సబ్ కమిటీ సభ్యులు కుట్రపూరితంగా చేశారని మండిపడ్డారు. 5కేటాయించిన గ్రూప్3లోని మాలలకు, 1 ఉన్న గ్రూప్1లోని వారికంటే తక్కువ ఉద్యోగాలు వస్తున్నాయంటే 1 కంటే తక్కువ రిజర్వేషన్ ను మాలలకు కేటాయించడం కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు తీరని అన్యాయం చేసిందన్నారు. సుప్రీంకోర్టు సూచనలకు విరుద్ధంగా 2011 జనాభా లెక్కలతో సరైన ఎంపెరికల్ డేటా లేకుండా కులాల వారిగా చేసిన ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపును పున: సమీక్షించి జీవో 99ని సవరించి మాలలతో పాటు గ్రూప్ త్రీ లో ఉన్న మరో 25 కులాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షులు మధు, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు సగరం రమేష్ ,మహేష్, రాఘవేందర్, అర్జున్, అనిల్, రవి, శంకర్, వాసు, నరేష్, మహేష్, ఐలప్ప తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

# యూడైస్ వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలి : కలెక్టర్

**గద్వాల టౌన్ నవంబర్ 12, ప్రభాతవార్త:** జిల్లాలోని పాఠశాలలకు సంబంధించిన యూడైస్ వివరాలు ఖచ్చితంగా, సమయానుకూలంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ ఆదేశించారు.బుధవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు విద్యాశాఖ పనితీరుపై జరిగిన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా పాఠశాలలు,విద్యార్థులు, ఉపాధ్యాయులు, మౌలిక వసతులకు సంబంధించిన వివరాలు యూడైస్‌లో నమోదయ్యే సమాచారం క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యాశాఖకు సంబంధించిన యాప్‌ల నిర్వహణ, డేటా నమోదు, పాఠశాలల పనితీరు పర్యవేక్షణలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత యాక్సల్(ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ఫర్ లెర్నింగ్ ) ప్లాట్‌ఫార్మ్‌ల ద్వారా విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేసి,వ్యక్తిగత విద్యా మద్దతు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఫౌండేషనల్ లిటరసి అండ్ న్యూమరసీ కార్యక్రమాన్ని పాఠశాలల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. పాఠశాలల్లో ఉన్న కంప్యూటర్లు విద్యార్థుల అభ్యాసానికి ఉపయోగపడేలా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇంటర్ నోడల్ అధికారి హృదయరాజు,జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి,ఈ.డి ఎస్సీ నుషిత, సెక్టోరియల్ అధికారులు హంపయ్య, శాంతిరాజు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.



యూడైస్ పై అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్ సంతోష్



విద్యార్థి అఫ్సర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

### రాష్ట్రస్థాయి 100 మీటర్ల పోటీలకు

## టిమ్రిస్ నాగసాల బాలుర –1 విద్యార్థి

**జడ్చర్ల నవంబర్ 12, ప్రభాతవార్త:** జడ్చర్లలోని టిజిఎం ఆర్ఎస్ బాలుర 1 పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి అఫ్సర్ రాష్ట్ర స్థాయి 100 మీటర్ల పరుగుపందెం అథ్లెటిక్స్ పోటీల కోసం ఎంపిక అవ్వడం పట్ల పాఠశాల యాజమాన్యం ఆనందం వ్యక్తం చేశారు. అఫ్సర్ జిల్లా స్థాయి పోటీలలో అద్భుత ప్రతిభను కనబరచి, రాష్ట్ర స్థాయికి అర్హత సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థికి హృదయపూర్వక అభినందనలు తెలియజేసారు. ప్రధానోపాధ్యాయురాలు పారిజాతం మాట్లాడుతూ మా విద్యార్థి అఫ్సర్ రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల సంతోషంగా ఉందని తను రాష్ట్ర స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ ఎంపిక పట్ల అఫ్సర్ ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పీఈటి శివప్రసాద్, పీడీ ఖాజాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ మేళాకు మూడే దరఖాస్తులు

**భూత్పూర్,నవంబర్ 12,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీలో మంగళ,బుధవారాలలో రెండ్రోజుల పాటు నిర్వహించిన రెవెన్యూ మేళా లో మూడు దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్,సూపరిన్‌టెండెంట్ నర్సింహులు తెలిపారు.ఇంటి నిర్మాణాల కొలతలు,ఇంటి నెంబర్లు,ఇంటి పన్నుల అంశాలలో మున్సిపాలిటీ రెండు రోజుల పాటు రెవెన్యూ మేళా నిర్వహించినట్లు తెలిపారు.మూడు దరఖాస్తుల్ని పరిష్కరించినట్లు కూడా వారు తెలిపారు.

## వెల్టూర్‌లో రెవెన్యూ సదస్సు

**ఉప్పునుంతల, నవంబరు 12 ప్రభాతవార్త :** రెవెన్యూ సదస్సులో భాగంగా బుధవారం మండలంలోని వెల్టూర్ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మండలంలో భూభారతిపై గ్రామ సభలో నిర్వహించారు. పలు సమస్యలపై రైతులు, ప్రజలు దరఖాస్తులు విన్నవించుకున్నారు. వాటిపై తుది నివేదిక తయారి కోసం మరోసారి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. వెల్టూర్ లో జరిగిన గ్రామసభలో గతంలో వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ రెవెన్యూ సదస్సులకు మండల రెవెన్యూ అధికారి బాల్ రాం నాయక్, గ్రామపంచాయతీ ఆఫీసర్ (జిపిఓ) రమేష్, సర్వేయర్ యశ్వంత్, భరత్, మాజీ సర్పంచ్ గుండె మోని లింగమయ్య యాదవ్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మామిళ్ళపల్లిలో లోపించిన పారిశుధ్యం



**ఉప్పునుంతల, నవంబరు 12 ప్రభాతవార్త :** మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో మురుగునీరు రోడ్లపై పారుతున్న పట్టించుకోవడం లేదని ఎస్సీ కాలనీ వాసులు వాపోతున్నారు. మురుగుదొడ్ల నీరు, వర్షపు నీరు ఎక్కడికి వెళ్లకుండా ఇండ్ల మధ్య ఉండడంతో దుర్గంధం ఏర్పడి దోమల బెడద అధికమైందని కాలనీవాసులు వాపోతున్నారు. ఎస్సీ కాలనీలో మురుగునీరు చెరువుల తలపించడంతో ఆ ప్రాంతం గుండా నడవలాడానికి వీలు లేకుండా పోయింది. ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు చొరవ తీసుకొని ఎస్సీ కాలనీలో చెరువులను తలపిస్తున్న మురుగు నీటిని తొలగించి రోగాల బారిన పడకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న మదాసి, మదారి కురువ సంఘ నాయకులు

## మదాసి,మదారి కురువలను ఎస్సీ జాబితాలో చేర్చాలి

**గద్వాల టౌన్ నవంబర్ 12, ప్రభాతవార్త:** రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడాలని, మదాసి, మదారి కురువలను ఎస్సీజాబితాలో చేర్చాలని మాదాసి,మదారి కురువ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గద్వాల ఆర్డి ఓ కార్యాలయం ఆవరణలో తమ డిమాండ్లను వ్యక్తపరుస్తూ వాటిని వెంటనే అమలు పరచాలని నిరసన తెలుపుతూ ఆర్.డి.ఓ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఇటీవల కొల్లాపూర్ సభలో రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, కలెక్టర్లు సభా వేదికపైనే ఉన్న సమయంలోమదాసి కురువలు, మదారి కురువలు విద్యలో, జీవితంలో చాల వెనకబడి ఉన్నారని, వారి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కురువులను అత్యున్నత స్థాయికి ఎదిగేలా తమ వంతు కృషిచేస్తా అని ముఖ్యమంత్రి ఆకాంక్షను వ్యక్తం చేసినట్లు వారు గుర్తుచేశారు. ముఖ్యమంత్రి ఆశయానికి విరుద్ధంగారెవెన్యూ అధికారులు మోనం ప్రదర్శించడంతగదని,వారు నిర్లక్ష్యం వీడి మదాసి, మదారి కురవాలను వెంటనే ఎస్సీ జాబితాలో చేయాలన్నారు. స్పష్టమైన సర్కార్ గెజిట్, ఎస్సీ కమిషన్ మెమో,కోర్టు ఆదేశాలుఉన్నప్పటికీ,మదాసి కురువ, మదారి కురువలకు ఎస్సీ కులపత్రాలు జారీ చేయకపోవడం వారి అసమర్థతకు నిదర్శనం అన్నారు.ఇది రాజ్యాంగ విరుద్ధం అని, అమా నవీయ చర్య అని సంఘ నాయకులు ఖండించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి మదాసి కురువ, మదారి కురువలకు ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలను తక్షణం జారీ చేయాలనీ వారు కోరారు.లేకపోతే వారి సంఘం ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్ర మంలో మదాసి,మదారి కురువ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ రామాపురం తిక్కయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కోయిల దిన్నే తిక్కయ్య, తనగల మధు, బాలకృష్ణ, కెపి రాజేష్, వివిధ మండలాల అధ్యక్షులు గ్రామాల అధ్యక్షులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే నర్సప్పకు ఘన నివాళి



మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ నర్సప్ప విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పలు పార్టీల నాయకులు

**భూత్పూర్,నవంబర్ 12,ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ఎన్ నర్సప్ప 27వ వర్ధంతిని అమిస్తాపూర్‌లో బుధవారం ఆయన కుటుంబ సభ్యులతో పాటు పలు పార్టీల నాయకులు నిర్వ హించారు.నర్సప్ప కన్వెన్షన్ ఆవరణలో ఏర్పాటు చేసిన నర్సప్ప విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.నాలుగు దశాబ్దాలుగా నర్సప్ప చేసిన సేవల్ని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో నర్సప్ప కుమారులు డాక్టర్ విజయ్‌కుమార్, చంద్రశేఖర్‌రాజు, శ్రీనివాసులుతో పాటు ఆగిరిరవి,మట్టి ఆనంద్,మల్లేష్, కెంద్యాల రాజేశ్, శ్రీశైలం, మల్లిఖార్జున్, దిలీప్,మన్నాన్,శ్రద్ధానంద్,గోవర్ధన్,ఎండి ఫారూక్,మొహ్మద్ సాధిక్ పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**రాజాపూర్, నవంబరు 12, ప్రభాతవార్త:** రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన పల్లె శ్రీను కుమారుడు అనారోగ్యానికి గురికావడంతో విషయం తెలుసుకున్న బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ ఆదిత్య బీజేపీ తిరుపతయ్య సేవాసమితి ద్వారా ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ. 5.000 వేలు ఆర్థికం సహాయం అందజేశారు. మున్ముందు కూడా బీజేపీ తిరుపతయ్య సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు, ఆర్థిక సహాయాలు అందజేసేందుకు ముందువరుసలో ఉంటానని ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఆదిత్య పేర్కొన్నారు. అడగగానే ఆసుపత్రి ఖర్చులకు నగదు అందజేసిన ఆదిత్యకు పల్లె శ్రీను కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బుగ్గయ్య, పల్లె తిరుపతి, శ్రీను, మల్లేష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై రైతులకు అవగాహన




రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఊట్కూర్, నవంబరు 12 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండలంలోని చిన్నపొర్ల గ్రామ శివారులోని విజయ కాటన్ మిల్ సమీపంలో బుధవారం రైతులకు సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కౌన్సిలర్ ఎస్.కే. చాంద్ సుల్తానా ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చాంద్ సుల్తానా మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని లింకులు, కాల్స్, బ్యాంకు వివరాలు అడిగే సందేశాలను నమ్మరాదని, ఆన్‌లైన్ లావాదేవీల్లో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులైన రైతులు తమ బ్యాంక్ వివరాలను ఎవరికీ వెల్లడించరాదని ఆమె హెచ్చరించారు. పోలీసు సిబ్బంది మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ అవగాహన అత్యంత అవసరమని పేర్కొన్నారు. సైబర్ మోసాలు ఎదురైతే వెంటనే 1930 నంబర్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవాలి

**ఊట్కూర్, నవంబరు 12 ప్రభాతవార్త:** తెలంగాణలో విద్యారంగ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డిని సామాజికవేత్త బిజ్వార్ మహేష్ గౌడ్ హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి వినతి చేశారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని అనేక పాఠశాలల్లో కనీస మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడం, విద్యార్థుల సంఖ్యకు తగినంత ఉపాధ్యాయులు లేకపోవడం ఆందోళనకరం" అని పేర్కొన్నారు. ప్రభుత్వానికి 8.700 కోట్ల ఫీజు బకాయిలు ఉన్నప్పటికీ కేవలం 600 కోట్లు మాత్రమే విడుదల చేస్తామని చెప్పి, అది కూడా ఇంకా అమలు కాలేదని గుర్తు చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ రోజురోజుకీ నిర్వీర్యం అవుతోంది. విద్యార్థుల గోడును వినే నాథుడు లేడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంతకాలం గడిచినా ఇప్పటికీ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం బాధాకరం,"అని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడంతో పాటు పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, అలాగే విద్యాశాఖ మంత్రి నియామకం త్వరలోనే జరిగేలా చూడాలని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డిని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు మహేష్ గౌడ్ చెప్పారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**మద్దూర్, నవంబరు 12 ప్రభాతవార్త :** ఉమ్మడి మద్దూరు కొత్తపల్లి మండలంలో తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కళ్యాణలక్ష్మిషాదీ ముబారక్ చెక్కులు 92 మంది లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను కాడ అధికారి వెంకటరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ గూళ్ళ నరసింహులు మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి సబ్బండ వర్గాల ప్రజలకు అండగా పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఆర్థికంగా ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. గ్రంథాలయ చైర్మన్ విజయ కుమార్, మార్కెట్ చైర్మన్ ముద్ది భీములు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింత తిరుపతిరెడ్డి, బాలీడు మహేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రఘుపతి రెడ్డి, కొత్తపల్లి వెంకట్ పాల్గొన్నారు.

## మంచి ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలి

● గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్



విద్యార్థులకు డిజిటల్ స్క్రీన్ పై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్ నవంబర్ 12, ప్రభాతవార్త:** విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ తెలిపారు. బుధవారం ఉండవెల్లి మండలం బొంకూరు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి డిజిటల్ స్క్రీన్ల ద్వారా బోధించే పాఠ్యాంశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యు డైస్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, పాఠశాల నిధులను నిబం ధనల ప్రకారం ఖర్చు పెట్టాలన్నారు.పాఠశాల తరగతి గదిలోనే అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తుండడంతో త్వరలోనే కేంద్రానికి పక్కా భవనం నిర్మించాలని సంబంధిత అధికారులతో మాట్లా డారు. పాఠశాలలో గ్రంథాలయ, సమాచార, క్రమశిక్షణ, ఆరోగ్య, ఫుడ్ కమిటీల పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నెలలోగాఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో విద్యాశాఖ ఏపిఓ శ్రీనివాసులు, పాఠశాల జిహెచ్ఎం మద్దిలేటి, పంచాయతీ సెక్రెటరీ రజియా బేగం, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**గద్వాల టౌన్,నవంబర్ 12, ప్రభాతవార్త:** మానవపాడు మండలం కలుకుంట్ల గ్రామంలో సహకార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ బి.ఎం. సంతోష్ బుధవారం పరిశీలించారు. మొక్కజొన్న గింజలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్నకు క్వింటాలుకు రూ.2400 చెల్లించడంజరుగుతుందని, రైతులుసద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు చేశాక రైతులకు డబ్బులు వెంటనే చెల్లింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కొనుగోలుకేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ పర్యటనలో అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, ఏఈఓ రాజమోహన్, తదితరులు పాల్గొన్నారు.

**మానవపాడు తహసిల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ...**

భూభారతి, సాదాబైనామ దరఖాస్తులను పెండింగ్‌లో పెట కుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.బుధవారం మానవపాడు మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు దరఖాస్తులు పరిశీలించారు. మండలంలో 508 సాదాబైనామ, 60 భూభారతి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంతో వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జోషి శ్రీనివాసశర్మ, ఉప తహసిల్దార్ కరుణాకర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## చిన్ననీటి వనరుల గణన పకడ్బందీగా చేపట్టాలి

● గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్

**గద్వాల టౌన్ నవంబర్ 12, ప్రభాతవార్త:** జిల్లాలోని చిన్ననీటి వనరుల లెక్క తేల్చేందుకు నిర్వహించనున్న గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు దేశవ్యాప్తంగా ఐదేళ్లకోసారి నిర్వహించే 7వ మైనర్ ఇరిగేషన్, రెండవ వాటర్ బాడీస్ సెన్సెస్ జిల్లాలో ఏ విధంగా నిర్వహించాలని అంశంపై జిల్లాస్థాయి స్టీరింగ్ కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని చిన్న నీటి పారుదల వనరుల గణన ప్రణాళిక ప్రకారం పూర్తిచేయాలని ఆదేశించారు. రెండు వేల హెక్టార్ల లోపు విస్తీర్ణం ఉన్న జలవనరుల గణన మొబైల్ అప్లికేషన్ ద్వారా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని వెల్లడించారు. మొదట ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని గణన పూర్తిచేసిన తర్వాత, తదుపరి గ్రామాల గణనను కొనసాగించాలన్నారు. తహసీల్దార్, ఎంపీడివో, నీటిపారుదల శాఖ ఏఈలు మండల స్థాయిలో పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు ఎన్యూమరేటర్లు గా కొనసాగుతారని తెలిపారు. జిల్లాలో ఉన్న 202 రెవెన్యూ గ్రామాల్లో చిన్న నీటి వనరుల గణన కోసం అవసరమైతే ఫీల్డ్,టెక్నికల్ అసిస్టెంట్స్‌ను కూడా ఎన్యూమరేటర్లుగా వినియోగించుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల వివరాలు సేకరించడంపై అందరూ ఎన్యూమరేటర్లకు జిల్లా,మండలాల స్థాయిలో త్వరితగతిన శిక్షణ పూర్తి చేయాలని ఆదేశించారు. పీపీటి ద్వారా ఎన్యూరేటర్లకు మొబైల్ అప్లికేషన్ గణన ప్రక్రియపై స్పష్టంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. నీటిపారుదల, విద్యుత్, ఇతర శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన వివరాలను గణన చేస్తున్న అధికారులకు అందజేయాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా గణన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ,సీపీఓ పాపయ్య, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాసులు, భూగర్భ జల వనరుల శాఖ డీడీ మోహన్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ ప్రభాకర్, విద్యుత్ శాఖ డీఈ తిరుపతిరావు, డిప్యూటీ ఎస్ఓ లు హరికృష్ణ, హైమావతి, డిఆర్డిఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సంరక్షణ చట్టం అమలు కావాలి



న్యాయవాదుల ర్యాలీ

**నారాయణ పేట, నవంబరు 12 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా నుంచి న్యాయవాదుల ర్యాలీకి సంఘీభావంగా ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ పిలుపు మేరకు న్యాయవాదుల సంరక్షణచట్టం అమలు కొరకు జోగులాంబ శక్తిపీఠం నుండి హైదరాబాద్ హైకోర్టు వరకు ప్రారంభమైన ర్యాలీకి సంఘీభావం తెలుపుతూ జిల్లా న్యాయవాదులు వాహనాలపై బయలుదేరారు. ఈ కార్యక్రమాన్ని పేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్,కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్,మాజీ అధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్ ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు నందునామాజీ, సీనియర్ న్యాయవాదులు మల్లికార్జున్, ఎస్.నారాయణ, విజయభాస్కర్‌రెడ్డి, కురుమన్నగౌడ్, కృష్ణగౌడ్, వినోద్‌కుమార్, రవికుమార్, మోహన్ యాదవ్, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం కోసం రాష్ట్రవ్యాప్తంగా చాలా సంవత్సరాలుగా పోరాటం కొనసాగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం చట్టం అమలు దిశగా చర్యలు తీసుకోవాలి అని అన్నారు. న్యాయవాదుల ర్యాలీకి సంఘీభావంగా కొత్తకోట వద్దకు చేరి మద్దతు తెలిపారు.

## వచ్చే విద్యా సంవత్సరానికి భవనాలు పూర్తి చేయాలి

నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



స్కూల్ కాంప్లెక్స్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

**మద్దూర్, నవంబరు12 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలోని మద్దూరు మండలంలో కడ నిధులు, ఇతర నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో కలిసి ఉమ్మడి మద్దూరు మండలంలో విస్తృతంగా పర్యటించి అభివృద్ధి నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముందుగా మద్దూరు మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో రూ. కోటి10లక్షల నిధులతో దాదాపు పూర్తి కావచ్చిన పీఏసీఎస్ ( సింగిల్‌విండో) కార్యాలయ భవననిర్మాణ పనులను పరిశీలించారు. చివరి దశ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రూ.55 లక్షలతో నిర్మిస్తున్న మద్దూరు సీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణ పనులను చూశారు. ఆస్పత్రిలోకి వెళ్ళి అదనపు వార్డులో ఫ్లోరింగ్ పనులు పూర్తి చేసిఆ వార్డును అందుబాటులోకి తీసుకురావాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు.తర్వాత రూ.30 కోట్లతో కొనసాగుతున్న మద్దూరు, మోమినాపూర్ రెండు వరసల బీటీ రోడ్డు నిర్మాణ పనులను చూసీ, పనులు ఎందుకు ఆలస్యంగా జరుగుతున్నాయని అధికారులు, గుత్తేదారుని ప్రశ్నించారు.రోడ్డుకు ఒకవైపు ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు జరగక పోవడంతో పనులు ఆగి సాగుతున్నాయని, అలాగే మిషన్ భగీరథ పైప్ లైన్లు ఉన్న చోట కొంత సమస్యగా మారుతోందని గుత్తేదారుడు కలెక్టర్‌కు తెలపడంతో స్పందించిన కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణ పనులకుఆటంకం కలగకుండా స్తంభాలను తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆమె ఆదేశించారు. అదే మార్గంలో రూ. కోటి 60 లక్షల వ్యయంతో నిర్మాణం అవుతున్న రెనివట్ల స్కూల్ కాంప్లెక్స్ పనులను చూశారు. పనుల్లో వేగం పెంచాలని, వచ్చే విద్యా సంవత్సరం నాటికి నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఆ తర్వాత మద్దూరు మండల కేంద్రం చింతల్‌దిన్నే వెళ్ళే దారి పక్కన రూ.30 లక్షల నిధులతో చేపట్టిన సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. అక్కడ నిర్మాణ పనులకు ఇబ్బందిగా మారిన ఓ ప్రార్థనా మందిరాన్ని తొలగించే అంశంపై స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు,అధికారులతో చర్చించారు. అందరూ కలిసి అక్కడే మరోచోట కొత్త మందిరాన్ని నిర్మించేలా తగిన నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్, కడ ప్రత్యేక అధికారి కోరారు. వీటితో పాటు మద్దూరు పోలీస్ స్టేషన్ చుట్టూ రూ.60 లక్షల నిధులతో కొనసాగుతున్న ప్రహరీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. మద్దూరు మండల కేంద్రానికి సమీపంలో రూ.6 కోట్లతో నిర్మించే ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని కూడా వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఈఈ హిర్యా నాయక్, డీఈఈ విలోక్, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డా. మల్లికార్జున్, తహసిల్దారు మహేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఎంపీఓ, రెవెన్యూ అధికారులు, మార్కెట్ చైర్మన్ ముద్ది బీములు, సింగిల్ విండో అధ్యక్షులు నర్సింలు, మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

**ఊట్కూర్, నవంబరు 12 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండలంలో నిర్వహించిన చదువుల పండుగ పోటీలలో వల్లంపల్లి పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించారు. దీంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు పోతుల నిత్య, మన్నె వెంకటేష్, పోతుల అక్షయ్ కుమార్‌లు తమ ప్రతిభతో అందరిని ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాధవి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు గౌరమ్మ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో కూడా మీ ప్రతిభను కొనసాగించి మండలానికి మంచి పేరు తెచ్చిపెట్టాలి అని విద్యార్థులను ప్రోత్సహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు శశిధర్‌రెడ్డి, సత్యపాల్, ఇందిరా దేవి తదితరులు విద్యార్థులను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## బెల్ట్ షాప్‌పై దాడి : కేసు నమోదు

**ఇటిక్యాల నవంబర్ 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బీచుపల్లి గ్రామ శివారులో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం అముతున్న షాప్‌లో బుధవారం ఎస్సై కే.రవి పోలీస్ సిబ్బందితో కలసి దాడి చేయగా బెల్ట్‌షాపులో 5.4లీటర్ల మద్యం పట్టుబడింది.ఈ మద్యం విలువ సుమారువేల 544 రూపాయలు విలువ ఉంటుందని షాప్ యజమానిపై కేసునమోదుచేయడంజరిగిందనిఎస్.ఐ.కే.రవి తెలిపారు..

## శ్రీసత్తేశ్వర ఆశ్రమంలో అన్నదానం




అన్నదానం చేసిన వారిని సన్మానిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

**రాజాపూర్, నవంబరు 12, ప్రభాతవార్త:** ప్రముఖ వ్యాపార వేత్త రాజాపూర్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కట్టా సంతోష్‌కుమార్ జన్మదిన మహోత్సవాన్ని పురస్కరించుకుని జడ్చర్ల పట్టణ శివారులోని శ్రీ సత్తేశ్వర సేవా అనాథ, మానసిక, వికలాంగుల ఆశ్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాజాపూర్ మండల యూత్ వింగ్ అధ్యక్షులు బంగారి వెంకటేష్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాబంగారి వెంకటేష్ మాట్లాడుతూ వ్యాపారవేత్తగా రాణిస్తూ పలువురికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న కట్టా సంతోష్ పలు సేవాకార్యక్రమాలు చేస్తూ తిర్మలాపూర్, రాజాపూర్ మండల ప్రజల మన్ననలు చూరగొంటున్నారని బంగారి వెంకటేష్ తెలిపారు. ఆపదలో ఉన్నవారికి తనకు తోచిన సహాయం చేస్తూ పలుఆలయాలు,నిరుపేదల పెళ్లిళ్లకు నేనున్నానంటూ భరోసనిస్తూ తోచిన సహాయ సహకారాలుఅందిస్తున్నారని అన్నారు. ఆయన జన్మదిన మహోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదానం చేయడం తనకు ఎంతో సంతోషానిచ్చిందని బంగారి వెంకటేష్ పేర్కొన్నారు. అన్నదానం నిర్వహించిన బంగారి వెంకటేష్ తదితరులను ఆశ్రమ నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్లయూత్‌వింగ్ మండల అధ్యక్షులు వల్లూరు వీరేష్, నాయకులు చుక్క మల్లేష్, అనిరుధ్‌చారి, మల్లేష్, గుడ్ల శ్రీశైలం, మలగల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ యువతకు ఉపాధి కోర్సులపై ఉచిత శిక్షణ

**గద్వాల టౌన్ నవంబర్ 12, ప్రభాతవార్త:** క్రైస్తవ మైనారిటీ యువతకు సోలార్ పానెల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులలో ఉచిత శిక్షణతో కూడిన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నుషిత ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని గద్వాల, ఐజ మున్సిపాలిటీలలో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఆసక్తి గల దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను సంబంధిత ధృవపత్రాలతో ఈ నెల 15వ తేదీ లోపు సమర్పించవలసిందిగా సూచించారు. దరఖాస్తుదారులు క్రైస్తవ/రోమన్ క్యాథలిక్/ఆంగ్లోఇండియన్ మతానికి చెందిన బిసి-సి సర్టిఫికేట్ కలిగినవారై ఉండాలన్నారు. వయస్సు 18 నుండి 45 సంవత్సరాల మధ్య ఉండాలనీ , తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలలోపు, మున్సిపాలిటీ పరిధిలో రూ.2 లక్షల లోపు ఉండాలని తెలిపారు. ఆధార్ కార్డు తప్పనిసరి ,ఎంపిక చేసిన కోర్సుప్రకారం కనీసవిద్యార్హత కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 7013032567 ను సంప్రదించవచ్చు లేదాజిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం, ఐ డి ఓ సి కాంప్లెక్స్, రూమ్ నం. ఎఫ్ 8 నందు ఆఫీస్ పని వేళల్లో సంప్రదించవలసిందిగా సూచించారు.

## ఘనంగా కార్తీక వనభోజన మహోత్సవం



వనహోత్సవంలో పాల్గొన్న మహిళలు

**మహబూబ్‌నగర్, నవంబర్ 12,ప్రభాతవార్త:** పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో బికె రెడ్డి కాలనీలోని బిబిఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం మహిళా విభాగం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉసిరి చెట్టుకు పూజలు చేసి మహిళలందరూ సామూహికంగా శ్రీ వెంకటేశ్వర గోవింద నామాలు జపించారు. అనంతరం ఉసిరి చెట్టు కింద సమావేశమై వన భోజనాల విశిష్టత గురించి తెలియపరుస్తూ ఈ వనభోజన కార్యక్రమం నిర్వహించారు. పుణ్య ప్రదమైన ఈ కార్తీకమాసంలో దేవతారాధన చేసి నివేదనలు సమర్పించి ఆప్రసాదాన్ని కార్యక్రమానికి విచ్చేసిన మహిళలందరూ భక్తిశ్రద్ధలతో ఆరగించారు.ఈ కార్యక్రమంలో సేవా సమితి మహిళా విభాగ అధ్యక్ష కార్యదర్శులు సరస్వతి,స్వరూప, కోశాధికారి శోభ, వనజ, వరలక్ష్మీ ్మ, నర్మద, శశికళ, హేమలత, శ్రీలత, అనిత, విజయ, వినోద, మాధవి,అరుణ, కవిత, పుష్పలత, పారిజాత, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఏంజెల్

**గద్వాల టౌన్ నవంబర్ 12, ప్రభాతవార్త:** ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై డాక్టర్ ఏంజెల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పేరు పరిధిలోని వీరాపురం గ్రామంలోని తెలంగాణ సోషియల్ వెల్ఫేర్ ( బి) హాస్టల్‌ల్లో వైద్యాధికారిని, డా. ఏంజెల్, వైద్య బృందం, విద్యార్థులకు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో విద్యార్థులు వర్షాకాలంలో, శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. విద్యార్థులకు పౌష్టికాహారం తీసుకోవడం వలన అనారోగ్యానికి గురికాకుండా ఉంటారని విద్యార్థులకు వివరించారు. అదేవిధంగాపరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలియజేశారు. హాస్టల్లోని వంటగదిని, స్టోర్ రూమ్ ను పరిశీలించి తీసుకోవాల్సిన తగు జాగ్రత్తల గురించి వంట మనుషులకు తెలియజేశారు. అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని స్టాఫ్ నర్స్ కు సూచించారు. ఈ కార్య క్రమంలో హెచ్. ఈ. ఓ రవిచందర్, సూపర్వైజర్ విజయ్ భాస్కర్, పి.హెచ్.ఎన్ నరసమ్మ, ఏఎన్ఎం హన్నమ్మ, ఆశా,ప్రిన్సిపల్ రాజు, స్టాఫ్ నర్స్ విజయలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

## మత్స్యకారుల ఉపాధి కోసమే చేపల విడుదల

● మంత్రి జూపల్లి కృష్ణారావు


చేప పిల్లలను వదులుతున్న మంత్రి జూపల్లి

**కొల్లాపూర్, నవంబరు 12 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెంచడానికి చేప పిల్లలను ఎరువులు నదులలో వదిలి వారి ఉపాధి కోసం కృషి చేస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం కొల్లాపూర్ మండలం సోమశిల దగ్గర శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో ఒక లక్ష చేప పిల్లలను వదిలిన మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు అనేక పథకాలు ప్రవేశపెట్టి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వంద శాతం సబ్సిడీతో మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో 2.50 కోట్ల చేప పిల్లల పంపిణీకి ఏర్పాట్లు చేశామని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, మత్స్య సంఘం నాయకులు, జాలర్లు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల వారోత్సవాలను విజయవంతం చేయాలి : కలెక్టర్ సిక్తా పట్నాయక్


వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

**నారాయణ పేట, నవంబరు 12 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో ఈ నెల 12 నుంచి 19 వరకు వయోవృద్ధుల వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధులు సమాజానికి మార్గదర్శకులని వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. జిల్లాలోని వయోవృద్ధులు వారోత్సవాల్లో పాల్గొని ఉత్సాహంగా భాగస్వాములు కావాలని ఆమె కోరారు. వారోత్సవాల్లో భాగంగా 12న ప్రారంభోత్సవం, 13న వినోద కార్యక్రమాలు, 14న ఆరోగ్య శిబిరం, 15న వాకథాన్, అవగాహన ర్యాలీ 19న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయని ఎఫ్ఆర్ఓ సాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో రషీద్, డా. శైలజ, ఎఫ్ఆర్ఓ సాయి, డీసీపీవో కరిష్మా పాల్గొన్నారు.

## నకిలీ బంగారంతో ఘరానా మోసం..

(మొదటి పేజీ తరువాయి)

స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.4,00,000, రూ.2,50,000, రూ.లక్ష ఇలా విడిగా మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఎస్పీ పౌరులకు హెచ్చరిక "అధిక లాభాల ఆశతో ఇన్వెస్ట్మెంట్లు చేయవద్దు, జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రజల సహకారంతో ఇలాంటి మోసాలను అరికడతామని చెప్పారు. కేసు విచారణలో అధికారులు డి.ఎస్.పి బుర్రి శ్రీనివాసులు, సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సై గోవర్ధన్ సిబ్బంది కానిస్టేబుల్ భీముడు, వెంకటేష్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం పత్తి కొనుగోలు చేయాలి


జిన్నింగ్ మిల్లును సందర్శిస్తున్న కలెక్టర్ సంతోష్, తదితర అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి దృష్టికి తీసుకెళ్లామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వాహనాల్లో రైతులు అమ్మేందుకు తీసుకొచ్చిన పత్తిని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ జిన్నింగ్ ప్రక్రియను పరిశీలించారు.ఈ పర్యటనలో జిల్లా మార్కెటింగ్ అధికారిని పుష్పమ్మ, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, సిసిఐ అధికారి రాహుల్ కలాన, తదితరులు ఉన్నారు.

## రైతుల ఆదాయ వృద్ధి లక్ష్యంగా పీఎం ధన్ ధాన్య కృషి యోజన

(మొదటి పేజీ తరువాయి)

పాడి పరిశ్రమ వంటి అనుబంధ రంగాల లబ్ధిదారులు కూడా లాభం పొందగలరు. వీరి ఆదాయ వృద్ధి కూడా సమగ్ర గ్రామీణ అభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు.మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం, ఆధునిక సాగు పద్ధతులను ప్రోత్సహించడం, ఉత్పాదకతను పెంచే లక్ష్యంతో రైతులకు విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో పలు సాగునీటి ప్రాజెక్టులు ఉండటంతో నీటి లభ్యత పుష్కలంగా ఉందని, దీనిని సమర్థంగా వినియోగించి మత్స్య పరిశ్రమ అభివృద్ధి సాధించవచ్చని చెప్పారు. పీఎం ధన్ ధాన్య కృషి యోజన సద్వినియోగం చేసుకుంటే నాగర్ కర్నూల్ జిల్లా దేశంలో వ్యవసాయ అనుబంధ ఉత్పాదక రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.కేంద్ర పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రైవేట్ రంగాల భాగస్వామ్యంతో అనుసంధానం చేసి రైతులకు మరింత సమర్థవంతమైన లాభాలు చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే నిర్వహించాలని, ప్రతి మండలంలో ఉత్పాదకత, పంట వైవిధ్యం, నీటి వనరులు, మార్కెట్ సదుపాయాలు, రుణాల లభ్యత,శీతల గిడ్డంగుల పరిస్థితి వంటి అంశాలను విశ్లేషించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను అధ్యయనం చేస్తూ రైతులకు ప్రయోజనాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పనితీరును నీతూ కుమారి ప్రసాద్ ప్రత్యేకంగా ప్రశంసించారు. రైతుల ఆదాయం పెంచేందుకు, సాగు వ్యయాలను తగ్గించేందుకు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు కలెక్టర్ చూపిస్తున్న కృషి ప్రశంసనీయమని నోడల్ అధికారి నీతు కుమారి ప్రసాద్, అభినందించారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని 20 మండలాల్లో వ్యవసాయ ఆధారిత పంటల సాగు విస్తీర్ణం, పంటల రకాలు (వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, మిరప), సాగునీటి వనరులు, నేల సాంద్రత, రైతుల స్థితిగతులపై వివరాలు సమర్పించారు. ప్రతి శాఖ వారీగా రూపొందించిన పథకం అమలు ప్రణాళికలను కూడా వివరించారు. జిల్లాలో రానున్న 6 సంవత్సరాల పాటు పంటఉత్పాదకత పెంచడం, పంటలమార్పిడి, సుస్థిర వ్యవసాయ విధానాలను ప్రోత్సహించే విధంగా ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన అమలుకు పక్కాగా సమగ్ర కార్యాచరణ వార్షిక ప్రణాళికను పకడ్బందీగా రూపొందించి అమలు చేసే ప్రతి అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. జిల్లాలో ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పాటు రైతులకు అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.సమావేశం చివరిలో జిల్లాస్థాయి అధికారులు తమఅభిప్రాయాలను వ్యక్తపరిచారు. నీతూ కుమారి ప్రసాద్ వారు అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి పీఎం ధన్ ధాన్య కృషి యోజన విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా మత్స్యశాఖ అధికారిని డాక్టర్ రజిని, జిల్లా పశు సమర్థిక శాఖ అధికారి జ్ఞాన శేఖర్, జిల్లా డైరీ డిడి సత్యనారాయణ రెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి మురళి ఇతర వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేయొద్దు

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి


భూభారతి దరఖాస్తుపై క్షేత్రస్థాయి పర్యటన చేపట్టిన కలెక్టర్


పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

**చిన్నంబావి, నవంబరు12 ప్రభాతవార్త :** మొక్కజొన్న కొనుగోలులో లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం చిన్నంబావి మండల కేంద్రంలో మార్కెఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. మండలంలో ఎన్ని ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశారని వ్యవసాయ అధికారులను ఆరా తీయగా 9500 ఎకరాల్లో సాగు చేసినట్లు బదులిచ్చారు. అనంతరం మొక్కజొన్న పంట ధాన్యంలోతేమను స్వయంగా తనిఖీచేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస మద్దతు ధర లభిస్తుందని తెలిపారు.రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన పలువురు రైతులు మాట్లాడుతూ తమకు మొక్కజొన్న పంటను విక్రయించేందుకు చిన్నంబావిలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం దూరం అయిందని, మండల పరిధిలోని అయ్యవారిపల్లిలో మరో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్కు విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రైతుల విజ్ఞప్తిని సంబంధిత మార్కెఫెడ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైతే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. అనంతరం మండల పరిధిలోని వెలగొండ మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ ద్వారా బోధించేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలని వెనుకబడిన విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థం చేసేందుకు ప్రారంభించిన కంప్యూటర్ తరగతుల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ఏఐ ద్వారా బోధన చేసేందుకు తరగతి గదుల్లో సరిపడు కంప్యూటర్లతో పాటు, అంతరాయం లేని ఇంటర్నెట్ సౌకర్యం కూడా కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాలలో పీఎం శ్రీ కింద చేపడుతున్న కార్యక్రమాల గురించి ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా పాఠశాలలో ఎఫ్ ఆర్ ఎస్ అటెండెన్స్ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. భూభారతి రెవెన్యూ దరఖాస్తుపై క్షేత్రస్థాయి విచారణ మండల పరిధిలోని చిన్నమారూర్ గ్రామానికి చెందిన 10 మంది రైతులు రెవెన్యూ రికార్డుల్లో భూమి తమ పేరిట ఎక్కలేదని భూభారతి రెవెన్యూ సదస్సులో అర్జీ పెట్టుకున్నారు. 201 సర్వేనెంబర్ లో 7 ఎకరాల 26 గుంటల భూమికి సంబంధించి వారు పెట్టుకున్న అర్జీకి సంబంధించి కలెక్టర్ బుధవారం క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేశారు. అర్జీదారుల సమస్యపై రికార్డులను పరిశీలన చేసి, పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లిన కలెక్టరుకు వెల్టూరు గ్రామ ప్రజలు తమ గ్రామంలో మద్యపానం నిషేధం కొరకు రైతు సంఘం ఆధ్వర్యంలో తీర్మానం చేసినట్లు కలెక్టర్కు తెలియజేశారు. దీంతో గ్రామస్తులను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసిల్దార్ కె. శ్రీనివాస్, స్థానిక మండల నాయకులు కళ్యాణ్ రావు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ నరసింహారెడ్డి, సీఈఓ నాగరాజు, ఏవో డాకేశ్వర్ గౌడ్, ఏఈఓ సాయిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు గంగారి శ్రీనివాస్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా చిన్ననీటి వనరుల గణన చేపట్టాలి

◆ జిల్లాలో చెరువులు, కుంటల గణనకు వేగంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

◆ నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్, నవంబరు 12 ప్రభాతవార్త :** చిన్న నీటి వనరుల గణన పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి 7వ స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీపీవో, డీఆర్డీఓ, వ్యవసాయ, నీటి పారుదల శాఖ, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని చిన్న నీటి పారుదల వనరుల గణన ప్రణాళిక ప్రకారం పూర్తిచేయాలని సూచించారు. రెండు వేల హెక్టార్లలోపు విస్తీర్ణం ఉన్న జలవనరుల గణన మొబైల్ అప్లికేషన్ ద్వారా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఆఫీసర్‌గా తహసీల్దార్, ఎంపీఎస్వో, నీటిపారుదలశాఖ ఏఈలు సూపర్‌వైజర్‌లుగా ఉంటారని, జీపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏఈవోలు ఎన్యూమరేటర్లుగా కొనసాగుతారని వివరించారు. జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల వివరాలను సేకరించడంలో ఎన్యుమరేటర్లకు ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్, ఎంపీఎస్వో, నీటిపారుదల శాఖ ఏఈలు, ఎంపీడీఓలు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. నీటి పారుదల శాఖ, ఇతర శాఖల అధికారులు తమశాఖలకు సంబంధించిన వివరాలను గణనలో పాల్గొనే అధికారులకు అందజేయాలని సూచించారు. ఆయాశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గణనను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. అమరేందర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సుజాత,పీడీ డిఆర్డిఏచిన్న ఓబులేష్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈ విజయ్‌కుమార్, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.

## యుడైస్ చేయకుంటే - పాఠశాలల గుర్తింపు రద్దు

● ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేట్‌లోనే అధికం

● డీఈఓ ప్రవీణ్‌కుమార్


యుడైస్‌పై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

**భూత్పూర్, నవంబర్ 12,ప్రభాతవార్త:** యుడైస్ చేయని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని,అవసరమైతే ఆ పాఠశాలల గుర్తింపును రద్దు చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటైన జిల్లాలోని ప్రైవేట్‌పాఠశాలల యాజమాన్యాలు,కంప్యూటర్ ఇంచార్జీలు,సీఆర్పీలతో యుడైస్,అపార్‌లపై డీఈఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఈఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలో అపార్,యుడైస్ చేయని పాఠశాలలు చాలా ఉన్నాయని,ఇందుకు సంబంధించి సీఆర్పీలు సంబంధిత స్కూల్స్ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే వారు లైన్లోకి రాకుండా ఫోన్లు స్విచ్ఆఫ్ చేసి ఉంచుతున్నారని, ఇది చాలాదారుణమని డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అపార్‌లేని విద్యార్థి చదువుకుంటు పడుతుందని ఇది గ్రహించి ఆయా పాఠశాలల యాజమాన్యాలు పిల్లల తల్లితండ్రులకు వివరించి వారి పిల్లల ఆధార్‌కార్డులు సిద్ధం చేసుకునేలా శ్రమించాలని సూచించారు.ఆధార్ ప్రకారం విద్యార్థుల ఎంట్రీ ఉండాలని, ఏవైన పొరపాట్లు దొర్లితే ఎస్ఓ 3 ఫారమ్ నింపి జిల్లా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఎంఓ దుంకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు వారి పాఠశాలల్లో చేర్చుకున్న పిల్లల యుడైస్,అపార్ చేసుకునేందుకు ఇది చివరి అవకాశంగా భావించి అపార్,యుడైస్‌ను వేగవంతం చేయాలన్నారు.యుడైస్‌పై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, కంప్యూటర్ ఇంచార్జీలతో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక సమావేశం చాలా ముఖ్యమైందని,ఈ సమావేశానికి హాజరుకాని ఆయా పాఠశాలల యాజమాన్యాలకు సంజాయిషీ,వివరణ కోరనున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సీఎంఈ నరేష్,కంప్యూటర్ ఇంచార్జీలు సంపత్,సుధాకర్‌రెడ్డి,నాగలక్ష్మితదితరులతో పాటు సీఆర్పీలు, వివిధపాఠశాలల కరస్పాండెంట్లు,జ్ఞానభారతిహై స్కూల్ కరస్పాండెంట్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ ఇతర కరస్పాండెంట్లు, ఆయా ప్రైవేట్ పాఠశాలల కంప్యూటర్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

## మీకు ఇబ్బందులుంటే నన్ను సంప్రదించండి

■ రైతులకు ఎమ్మెల్యే యెన్నం భరోసా

■ వరి కొనుగోలు పారదర్శకంగా ఉండాలి

■ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మాలని సూచన


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 12, ప్రభాతవార్త:** రైతులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే మండల/జిల్లా అధికారులు లేదా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.మహబూబ్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రైతులు తప్పనిసరిగా ప్రభుత్వఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు.కనీస మద్దతు ధరకు ప్రభుత్వం హామీ ఇస్తుందని, రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల ధాన్యాన్ని అనధికారంగా తక్కువ ధరకే కొనుగోలు చేయాలని ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం," అని ఎమ్మెల్యే హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.కోటి24 లక్షలు మంజూరు చేసిందని, త్వరలోనే కొత్త షెడ్లు మరియు ఇతర అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అధికారులు, రైతులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

(మొదటి పేజీ తరువాయి)



స్వీకరించారు. అనంతరం ఆయన మంత్రి వాకిటి శ్రీహరి, శాసన సభ్యులతో కలిసి మెట్ల మార్గంలో కొండపై గల ఆలయ ప్రధాన ద్వారం వద్దకు చేరుకోగానే మంగళ వాయిద్యాలతో అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో కురుమూర్తి స్వామికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ప్రధానాలయంలో ఆలయ విశిష్టతను అర్చకులు శాసన సభ స్పీకర్‌కు వివరించారు. అర్చకులు శాలువాతో సత్కరించి ఆశీర్వచనం అందచేసి తీర్థ ప్రసాదాలు అంద చేశారు. స్వామివారి జ్ఞాపకను అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఒక్కొకటిగా నెరవేర్చేందుకు, రాష్టానికి మంచి పేరు వచ్చేలా ప్రజా పాలన ప్రభుత్వం మరో ఐదు సంవత్సరంలు ఉండేలా దీనించాలని, రాష్ట్రంలోని రైతులు,ప్రజలు సుభిక్షంగా ఉండేలా ఆశీర్వదించాలని స్వామి వారిని కోరినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, ఎస్పీ డి.జానకి, ఆలయ ఈఓ మదనేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, నాయకులు అరవింద్ కుమార్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, విండో చైర్మన్లు సురేందర్ రెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి, వట్టెం శివకుమార్, ఎస్. వెంకటేష్, పాలకమండలి సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

**వంగూరు, నవంబరు12 ప్రభాతవార్త:** కల్యాణ లక్ష్మీ,షాది ముబారక్ చెక్కులు,ఐకేపీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాధమోని రమేష్ గౌడ్ తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు వంగూరు మండలం తిప్పారెడ్డిపల్లి, 10 గంటలకు నిజంబాద్ గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారని వివరించారు. అనంతరం మండల కేంద్రంలో రైతువేదికలో కల్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తారు. వంగూరు మండల కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు,పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి


పాఠశాలను సందర్శించిన డిఆర్‌డిఓ ఓబులేసు

**వెల్దండ, నవంబరు 12 ప్రభాతవార్త :** విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని డిఆర్డీవో ఓబులేసు అన్నారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ ను ఎంపీడీవో సత్యపాల్ రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి వంటగదిని పరిశీలించారు. విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష

**వెల్దండ, నవంబరు 12 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై ఎస్సై కురుమూర్తి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేయగా మూసాపేట మండలానికి చెందిన మల్ల గోని గంగాధర్ గౌడ్ (30) మద్యం సేవించి వాహనాల నడుపుతుండగాడ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో దొరికిపోయాడు. జడ్జి జాడ కావ్య మూడురోజుల సాధారణ జైలు శిక్షతోపాటు రూ. 600ల జరిమానా విధించినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా ప్రమాణలను ఖచ్చితంగా పాటించాలని అన్నారు.

## సోమయ్య కుటుంబానికి పరామర్శ


సోమయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

**వెల్దండ, నవంబరు 12 ప్రభాతవార్త :** మండలంలోని లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు సోమయ్య అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, సోమయ్య కుటుంబాన్ని పరామర్శించి ఘనంగా నివాళులర్పించారు. అదే విధంగా 10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని కుటుంబానికి అందజేశారు.అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఏద్మసత్యం, మాజీఎంపీపీ పుట్టర్నారెడ్డి, వెంకటయ్య గౌడ్, నాగులు నాయక్, వెంకట్‌రెడ్డి, నిరంజన్, జంగిలిఆనంద్, కొండల్‌యాదవ్, జంగిలి యాదగిరి, పోలే అశోక్, శ్రీనుతో పాటు తదితరులు ఉన్నారు.

## 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పిడిఎస్ రైస్‌ను పట్టుకున్న దృశ్యం

**దామరగిద్ద, నవంబరు 12 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం మొగల్ మడక గ్రామంలో పిడిఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారన్న పక్క సమాచారంతో దామరగిద్ద ఎస్సై రాజు, పోలీసు సిబ్బంది కలిసి మొగల్ మడక గ్రామంలోని ఓనర్ గుంత హనుమంత్ ఇంటి వద్ద సుమారు 7 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టుకొని డిప్యూటీ తహసిల్దార్ పంచనామా అనంతరం గుంత హనుమంత్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, అమ్మడం, నిల్వ ఉంచడం నేరం. ఇలాంటి చట్టవిరుద్ధ చర్యలలో పాల్గొనేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.